


ఫ్లెక్సీలను చింపుతున్న కార్యకర్తలు



రణరంగం

సీఎం రేవంత్ సమక్షంలో బయటపడ్డ గ్రూపులు

- కోకాకోలా కంపెనీ వద్ద మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి వర్గీయుల హల్‌చల్
- తన వర్గానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆందోళన
- పోలీసులతో వాగ్వాదం.. ఫ్లెక్సీల చింపివేత
- అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే బండారు, తూంకుంట మధ్య వార్
- పదవుల పందేరంలో ముదిరిన విభేదాలు



పోలీసులు అడ్డుకోవడంతో నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



నర్సారెడ్డితో మాట్లాడుతున్న సీపీ అనురాధ

గజ్వేల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గంలో నివురుగప్పిన నిప్పులా ఉన్న కాంగ్రెస్ పార్టీ కుమ్ములాటలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎదుటే బహిర్గతమయ్యాయి. ఏడాది కాలంగా రగులుతున్న ఈ కుమ్ములాటలు సీఎం పర్యటన నేపథ్యంలో ములుగు మండలం బండ తిమ్మాపూర్‌లో బయటపడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం బండ తిమ్మాపూర్‌లో కోకాకోలా పరిశ్రమ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సందర్భంగా అధికారులతో పాటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తూంకుంట నర్సారెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు తమతమ వర్గాలతో కలసి సీఎంకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆహ్వానించారు. ఈ క్రమంలో ఫ్యాక్టరీ వద్దకు చేరుకోగానే నర్సారెడ్డిని, ఆయన అనుచరులను పోలీసులు అడ్డుకున్నారు. నర్సారెడ్డి ఒక్కరికే అనుమతి ఉందని ఇతరులకు అనుమతి లేదని పోలీసులు చెప్పారు. దీంతో నర్సారెడ్డి వర్గీయులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అక్కడ ఉన్న ఫ్లెక్సీలను చించేశారు. తమను అనుమతించాలని డిమాండ్ చేశారు. అయినా పోలీసులు నిరాకరించడంతో దాదాపుగా 20 నిమిషాల పాటు పెద్దఎత్తున నినాదాలు చేశారు. కాసేపటికి నర్సారెడ్డి తనతో పాటు తూప్రాన్ మున్సిపల్ చైర్మన్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లను లోపలికి అనుమతించాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఒక్కరికే అనుమతి ఉందని చెప్పడంతో పెద్దఎత్తున నినాదాలు చేయడంతోపాటు బారికేడ్లను దాటుకుంటూ ఫ్యాక్టరీ లోపలికి చొచ్చుకువెళ్లే ప్రయత్నం చేశారు. పోలీసులు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని వారిని నిరోధించారు. అనంతరం సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ, గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి నర్సారెడ్డితో మాట్లాడుతున్న క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డికి విషయం తెలిసి లోపలికి పిలిపించుకుని మాట్లాడారు. అనంతరం రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌తో పాటు నర్సారెడ్డి బయటకు వచ్చి అక్కడున్న కార్యకర్తలకు అభివాదం చేశారు.



కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

రాత్రి నుంచే పంచాయితీ

ములుగు మండలం బండ తిమ్మాపూర్‌లో సీఎం రాక సందర్భంగా ఆదివారం రాత్రి నర్సారెడ్డి వర్గంతో పాటు బండారు శ్రీకాంత్‌రావు వర్గం ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. అప్పటి నుంచే ఇరువర్గాల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఒక వర్గం ఫ్లెక్సీలను మరొక వర్గం వారు చింపేశారు. ఈ నేపథ్యంలో ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారంతో పెద్దఎత్తున సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. అయినప్పటికీ పోలీసులకు ఇబ్బందులు తప్పలేదు.

డీఎస్ రాకతో మొదలైన కాక

2012 వరకు ఇద్దరు కలిసి మెలసి ఉన్నప్పటికీ 2012లో అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు డీఎస్ (ధర్మపురి శ్రీనివాస్)ను టీపీసీసీ కార్యదర్శిగా ఉన్న బండారు శ్రీకాంత్‌రావు తన స్వగ్రామమైన గజ్వేల్ మండలం జాలిగామలోని హరిహరస్వామి ఆలయానికి ఆహ్వానించాడు. డీఎస్ జాలిగామకు రావడం.. గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉన్న తూంకుంట నర్సారెడ్డికి సమాచారం లేకపోవడంతో వారి మధ్య వార్ మొదలైంది. 2023లో అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీకి పోటీ చేసే వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ క్రమంలో బండారు శ్రీకాంత్‌రావు, మాదాడి జశ్వంత్‌రెడ్డి నర్సారెడ్డికి వ్యతిరేకంగా తమకు టికెట్ కేటాయించాలని దరఖాస్తు చేసుకోవడంతో పాటు గాంధీభవన్ ఎదుట ధర్నాకు

మిగతా 9వ పేజీలో...



కాన్వాయ్‌లో వెళ్తు కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పక్కన నర్సారెడ్డి

కలియదిరుగుతూ.. అభివాదం చేస్తూ..

- గ్రీన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీని ప్రారంభించిన సీఎం
- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు

ములుగు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండ తిమ్మాపూర్‌లో హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ గ్రీన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీని ప్రారంభించేందుకు సోమవారం వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి సుమారు గంట పాటు ఫ్యాక్టరీలో కలియదిరిగారు. అక్కడికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అభివాదం చేస్తూ.. ఫ్యాక్టరీ వివరాలను అక్కడి బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం 2.20 నిమిషాలకు బండ తిమ్మాపూర్‌కు చేరుకున్న సీఎం 2.30గంటలకు ఫ్యాక్టరీని ప్రారంభించారు. రేవంత్ పర్యటన మొత్తంలో సీఎం జిందాబాద్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఆయనవెంట తెలంగాణ ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, పరిశ్రమలు, వాణిజ్య, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, అటవీ, పర్యావరణ, శాస్త్ర, సాంకేతికశాఖ మంత్రి కొండా సురేఖ, తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్, కలెక్టర్ ఎం.మనుచౌదరి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, హెచ్‌సీసీబీ సీఈవో జువాన్ పాబ్లో రోడ్రిగ్స్, మల్టీ జోన్ వన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ, మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, రాష్ట్రనాయకులు బండారు శ్రీకాంత్‌రావు, మహిపాల్‌రెడ్డి, చెరుకు శ్రీనివాస్ రెడ్డి, పూజల హరికృష్ణ, ఆవుల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా జీఐఎస్ సర్వే

మెదక్ మున్సిపాలిటీలో అమృత్ 2.0 బృందం పర్యటన

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న అమృత్ 2.0 సర్వే మెదక్ మున్సిపాలిటీ పరిధిలో జోరుగా సాగుతున్నది. జనాభా 50వేల నుంచి లక్ష లోపు ఉన్న మున్సిపాలిటీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద నిధులిస్తుంది. ఇందులోభాగంగా కొత్త మాస్టర్‌ప్లాన్ రూపకల్పన, భూగర్భ డ్రైనేజీ, మంచినీటి ట్యాంకులు, మిషన్ భగీరథ పైపులైన్ తదితర పనులను చేపడతారు. చేయాల్సిన పనులను జీఐఎస్ (గ్లోబల్ ఇన్ఫర్మేషన్ సిస్టం) ఆధారంగా నిర్ధారిస్తారు. మెదక్ మున్సిపాలిటీలో మూడు రోజులుగా అమృత్ 2.0 బృందం జీఐఎస్ సర్వే చేపడుతున్నది. డ్రోన్, శాటిలైట్ ద్వారా ఫొటోలు తీసి మ్యాపింగ్ చేస్తున్నారు. ఈ విధానంతో పట్టణంలోని అంగులం గుర్తించే అవకాశం ఉంది. పట్టణం నలువైపులా 50 స్టేషన్లు గుర్తించి ఎక్కడ ఎంత స్థలం ఉంది, రోడ్ల విస్తీర్ణం, భూగర్భ డ్రైనేజీ ఎన్ని కిలోమీటర్లు అవసరమనే వివరాలను సేకరిస్తున్నారు. ఇలా గుర్తించిన మాస్టర్‌ప్లాన్‌ను డీటీపీసీకి అనుమతి కోసం పంపించనున్నారు. అనంతరం గుర్తించిన పనులను చేపట్టేందుకు అవసరమైన నిధులను కొంతమేర కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తుంది.



జీఐఎస్ సర్వే చేపట్టడుతున్న అమృత్ 2.0 బృందం సభ్యులు

వారం రోజుల్లో సర్వే పూర్తి



అమృత్ 2.0 పథకం కింద మెదక్ మున్సిపాలిటీ ఎంపికైంది. ఐదుగురితో కూడిన బృందం పట్టణంలో జీఐఎస్ సర్వే చేపడుతున్నది. ఈ బృందం నివేదికను డీటీపీసీకి పంపించి నూతనంగా తయారుచేసిన శాటిలైట్ మాస్టర్‌ప్లాన్‌ను ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతాం. ఈ నివేదికి ఆధారంగా పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించే అవకాశం ఉంటుంది.

-శ్రీనివాస్‌రెడ్డి,
మెదక్ మున్సిపల్ కమిషనర్



మెదక్ జిల్లా అల్లీపూర్‌లో నిరుపయోగంగా క్రీడా ప్రాంగణం

బోర్డులు సరే.. మైదానాలేవి?

- అటకెక్కిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు
- పిచ్చిమొక్కలతో ఆట స్థలాలు కనుమరుగు
- పలుచోట్ల పార్కింగ్, నర్సరీలకు వినియోగం
- ప్రజాధనం వృథా
- వినియోగంలోకి తేవాలని విజ్ఞప్తులు

9

తాగొచ్చి వేధిస్తున్న భర్తను కొట్టి చంపిన భార్య

9

ఆటో ఈఎంఐ కట్టలేక యువకుడి ఆత్మహత్య

7,248 కుటుంబాలు..
రూ.56.87 కోట్లు మాఫీ

మెదక్ జిల్లాలో నాలుగో విడత రుణమాఫీకి సిద్ధం

ఇప్పటి వరకు 82,294 మందికి రూ. 661.54 కోట్లు

మెదక్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీ నాలుగో విడత అమలుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మెదక్ జిల్లా అధికారులు ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగవ విడతలో 7,248 మంది రైతుల కుటుంబాలకు రూ.56.87 కోట్లు మాఫీ చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ తెలిపారు.

ఎన్నికల హామీ పూర్తి

కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం మెదక్ జిల్లాలో 2,63,033 రైతు కుటుంబాలకు రూ. 194.54 కోట్ల రుణాలను మాఫీ చేసింది. జూలై 18న మొదటి విడత రుణమాఫీలో భాగంగా రూ.లక్ష లోపు రుణాలు 48,251 మంది రైతులకు రూ.240.78 కోట్లు మాఫీ చేశారు. జూలై 30న రెండో విడతలో లక్షన్నర లోపు 21,618 మందికి రూ.204.40 కోట్లు రుణమాఫీ చేశారు. మూడో విడతలో భాగంగా రూ. రెండు లక్షల వరకు రుణాలు పొందిన 12,425 మంది రైతులకు రూ.159.03 కోట్లు మాఫీ చేశారు. ప్రస్తుతం నాలుగో విడతలో మిగిలిన రైతుల రుణాలను మాఫీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటి మూడు విడతల్లో రుణమాఫీ జరగని రైతుల వివరాలను సేకరించామని, వీరందరి ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమవుతున్నాయని అధికారులు తెలిపారు.

జహీరాబాద్ డివిజన్‌లో రూ.42 కోట్లు

జహీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నాలుగో విడత రుణమాఫీ చేసిన నేపథ్యంలో రైతులు సోమవారం జహీరాబాద్ పట్టణంలోని ఏడీఏ కార్యాలయానికి తరలి వచ్చి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జహీరాబాద్ డివిజన్‌లో నాలుగో విడతలో మొత్తం 3,419 మంది రైతులకు రూ.42కోట్ల మేర రైతు రుణమాఫీ జరిగిందని వ్యసాయశాఖ అధికారులు తెలిపారు. జహీరాబాద్ మండలంలో 1,527 మందికి రూ.17.69కోట్లు, ఝరాసంగంలో 570 మందికి రూ.6.80కోట్లు, న్యాల్‌కల్‌లో 829 మందికి రూ.10కోట్లు, కోహీర్ మండలంలో 299 మందికి రూ.3.25కోట్లు, మొగుడంపల్లి మండలంలో 214 మందికి రూ.2.68 కోట్లమేర రుణమాఫీ జరిగిందని సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.



జహీరాబాద్ ఏడీఏ కార్యాలయంలో రుణమాఫీ వివరాలు తెలుసుకుంటున్న రైతులు



సంగారెడ్డి జీజీహెచ్‌లో ట్రాన్స్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ క్రాంతి



మెదక్‌లో ప్రజాపాలన-ఆరోగ్య ఉత్సవాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆస్పత్రుల్లో ట్రాన్స్‌జెండర్ క్లినిక్

- వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం రేవంత్
- నర్సింగ్ కళాశాల తరగతులూ..

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల్లో భాగంగా సోమవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో నర్సింగ్ కాలేజీల తరగతులు, పారామెడికల్ కోర్సు, ట్రాన్స్‌జెండర్ల కోసం ఉద్దేశించిన మైత్రి క్లినిక్‌లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి వర్చువల్ ప్రారంభించారు. జోగిపేటకు మంజూరైన నర్సింగ్ కాలేజీ తరగతులు, పారా మెడికల్ కోర్సు, ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను ప్రారంభించారు. సంగారెడ్డి మెడికల్ కళాశాల నుంచి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పాల్గొన్నారు. అనంతరం సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మైత్రి క్లినిక్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాన్స్ క్లినిక్‌లో ప్రతీ గురువారం ఓపీ సేవలు ఉంటాయని, ఇందుకోసం ప్రత్యేకంగా మెడికల్ ఆఫీసర్, కౌన్సిలర్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నర్సింగ్ కాలేజీతో యువతకు అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.సుధామాధురి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో...

మెదక్ కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల్లో భాగంగా సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ట్రాన్స్ క్లినిక్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను, మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రారంభించారు. మెదక్ జీజీహెచ్‌లో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రకుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను సూపరింటెండెంట్ శివదయాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మైత్రి క్లినిక్లను ట్రాన్స్‌జెండర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కమలా దేవి, ప్రొఫెసర్ శాంతకుమారి, గైనకాలజీ హెచ్‌వోడీ శాంతకుమారి, వైస్‌ప్రిన్సిపాల్ వాణి, పద్మజ, వైద్యాధికారులు, మెడికోలు పాల్గొన్నారు.

ప్రభుత్వాపత్రిలో వైద్యుల కొరతపై వైద్య విధాన పరిషత్ ఆరా

- నేడు బీజేపీ జిల్లా కమిటీ విజిట్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రామాయంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామాయంపేటలోని ప్రభుత్వ ఆసత్రిరలో వైద్యుల కొరతపై వైద్య విధాన పరిషత్ ఆరా తీసింది. ఆస్పత్రిలో నెలకొన్న పరిస్థితిపై 'కార్పొరెట్ వసతులు.. కానరాని వైద్యులు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైన కథనంపై వైద్యాధికారులు స్పందించారు. రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఈ విషయంపై ఆరా తీసినట్టు తెలిసింది. అలాగే, ఆస్పత్రిలో పరిస్థితిని పరిశీలించడానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్ తదితరులతో కూడిన జిల్లా కమిటీ మంగళవారం ఆస్పత్రిని విజిట్ చేయనున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇదే విషయంపై సోమవారం కాంగ్రెస్ నాయకులు స్పందిస్తూ త్వరలోనే డాక్టర్లను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు.

స్టోన్ క్రషర్ అనుమతులు రద్దు చేయాలి

● నల్తూరు గ్రామస్థుల ధర్నా



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నల్తూరు గ్రామస్థులు

జిన్నారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నల్తూరు పరిధిలో ఏర్పాటు చేస్తున్న స్టోన్ క్రషర్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని గ్రామస్థులు కలెక్టరేట్, మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. నల్తూరు గ్రామ పరిధి 160 సర్వే నంబరులో కంకర క్వారీల ఏర్పాటు కోసం చేపట్టిన పనులను గ్రామస్థులు అడ్డుకున్నారు. పనులు నిర్వహిస్తున్న ఎక్స్‌కవేటర్లను వెనక్కి పంపించారు. గ్రామ మాజీ సర్పంచ్ జనార్దన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో గ్రామస్థులు సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. గ్రామ పరిధిలో స్టోన్‌క్రషర్ ఏర్పాటును నిలిపి వేయాలని, పంట పొలాలు, జల వనరులు, నివాసాలు క్రషర్ల ఏర్పాటుతో దెబ్బతింటాయని కలెక్టరేట్ గేట్ ఎదుట బైఠాయించి, ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రాన్ని అందజేశారు. అక్కడి నుంచి జిన్నారం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. క్రషర్లకు ఇచ్చిన అనుమతులు రద్దు చేసే వరకు పోరాటం ఆగదని తెలిపారు. తహసీల్దార్ భిక్షపతికి వినతిపత్రం అందజేసి, క్రషర్ల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

భూమి కబ్జా చేశారు.. కొడుకు వెళ్లగొట్టాడు

● న్యాయం చేయాలని 'ప్రజావాణి'లో బాధితుల ఫిర్యాదు
● ఉమ్మడి జిల్లాలో 189 వినతులు
● సిద్దిపేట జిల్లాలో 74, మెదక్‌లో 72, సంగారెడ్డిలో 43 అర్జీలు
● సత్వరమే పరిష్కరించాలని అధికారుల ఆదేశం

సిద్దిపేట కలెక్టరేట్/సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : 'నాకు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు. కొడుకు నన్ను ఇంట్లో నుంచి వెళ్లగొట్టిండు సారు. అంతేకాదు నా పేరు మీదున్న 4 ఎకరాల భూమిని పట్టా చేసుకున్నాడు. ఇప్పుడు బిడ్డ దగ్గరే బతుకుతున్న. నాకు న్యాయం చేయండి' అని సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని వెన్ననవానిపల్లికి చెందిన వంకాయల కొమురమ్మ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

'నా పేరు మీద ఉన్న 30 గుంటల భూమిని మా గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కబ్జా చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. నేను దివ్యాంగుడిని కావడంతో మమ్మల్ని వారు బెదిరిస్తూ.. వారు మాపై దాడి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మాకు కలెక్టర్ సారే న్యాయం చేయాలి' అని సిద్దిపేట జిల్లా మర్కూములకు చెందిన బాల్‌రాజు అర్జీ అందజేశారు.

'నా భర్త అనారోగ్యంతో చనిపోయాడు. ఆయన పేరున సర్వే నంబర్ 66-2-అలో 26 గుంటల భూమి ఉన్నది. నా పేరున మార్చాలని ఏడేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పౌతిమార్పులు చేయడం లేదు. కలెక్టరమ్మ మీరే చేయించాలి' అని కల్హేర్ మండలం ఫత్తేపూర్‌కు చెందిన పోశవ్వ సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

సోమవారం మూడు జిల్లాలో కలెక్టరేట్‌లలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి తరలివచ్చిన బాధితులలో కొందు ఇచ్చిన ఫిర్యాదులు ఇవి. ఉమ్మడి జిల్లాలో 189 దరఖాస్తులు వచ్చాయి. సిద్దిపేట జిల్లాలో 74 ఫిర్యాదులు, మెదక్‌లో 72, సంగారెడ్డిలో 43 అర్జీలను బాధితులు అధికారులకు అందజేసి న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. సిద్దిపేట జిల్లాలో కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. బాధితులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని, ఎంతో నమ్మకంతో జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యల పరిష్కారానికి ప్రజావాణికి వస్తున్నారని, అంతే నమ్మకంతో వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని జిల్లా అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ వల్లూరు క్రాంతి అర్జీలను స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఆర్వో పద్మజారాణి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. మెదక్ జిల్లాలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి భుజంగరావు అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను పరిశీలించి పరిష్కారం దిశగా కృషిచేయాలని జిల్లా అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





దరఖాస్తు తీసుకుంటున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి, దివ్యాంగుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న సిద్దిపేట అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

మరికొన్ని అర్జీలు

● తనకు ఇద్దరు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారని, ఇటీవల పక్షవాతం వచ్చి మంచానికే పరిమితమయ్యానని, తనను భార్యను కొడుకులు, కోడలు పట్టించుకోవడం లేదని సిద్దిపేట ప్రజావాణిలో వడ్లూరు గ్రామానికి చెందిన వెల్దండి మల్లేశం ఫిర్యాదు చేశారు. తన భార్యను కొట్టి బంగారం తీసుకుని, తమ దొంగ సంతకాలతో ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, న్యాయం చేయాలిని మొర పెట్టుకున్నారు.

● అందోల్ మండలం డాకూర్ గ్రామానికి చెందిన కలాలి బేతాగౌడ్ తనకు సంబంధించిన భూమి ఆన్‌లైన్‌లో చూపుతున్నా ఈసీలో తన పేరు కాకుండా ఇతరుల పేరు వస్తుందని సంగారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ వాపోయాడు. ఈ విషయమై పలుమార్లు మండల తహసీల్దార్ అధికారులను సంప్రదించినా వారు పట్టించుకోవడం లేదని ప్రజావాణికి వస్తే అధికారులు నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని తెలిపాడు. ఇక్కడ పలుకుబడి ఉన్నవారికే న్యాయం జరుగుతుందని పేదలకు న్యాయం కోసం ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించాడు.

● కోహీర్ మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్, జగన్నాథ్, మహేష్ తాము కంటి వెలుగులో వాహనాలు నడిపిన డబ్బు ఇంతవరకు ఇవ్వలేదని సంగారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రెండు సంవత్సరాల నుంచి వారం పది రోజుల్లో వస్తాయని తిప్పుతున్నారని వాపోయారు. తాము క్యాబ్ వాహనాలు నడుపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని బకాయి డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

● సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామానికి చెందిన అక్తర్ అలీ తనకు సంబంధించిన భూమిలో ఐదు గుంటలు తక్కువగా వచ్చిందని సరి చేసి ఇవ్వాలని కలెక్టర్‌కు విన్నవించారు.

● సంగారెడ్డి సోమేశ్వరవాడకు చెందిన అంబుజ తన భర్త 2018లో అనారోగ్యంతో మృతి చెందాడని తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని వారిని పోషించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కలెక్టర్‌కు అందజేసిన అర్జీలో వేడుకున్నారు.

● జిన్నారం మండలం ఖాజీపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు మల్లేశం తనకు పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయులు

● వేర్వేరు పాఠశాలల్లో ఘటనలు
● వట్‌పల్లిలో ప్రైవేటు స్కూల్ ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన
● కొల్చారంలో ఉపాధ్యాయుడిని నిలదీసిన తల్లిదండ్రులు

వట్‌పల్లి/కొల్చారం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు విద్యార్థులను ఉపాధ్యాయులు వాతలు వచ్చేలా కొట్టిన ఘటనలు సంగారెడ్డి, మెదక్ జిల్లాలో సోమవారం వెలుగుచూశాయి. సంగారెడ్డి జిల్లా వట్‌పల్లిలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో హోం వర్క్ చేయలేదని ఏడో తరగతి విద్యార్థిని చితకబాదగా, మెదక్ జిల్లా కొల్చారం ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని టీచర్ కొట్టారు. తల్లిదండ్రులు, పాఠశాల విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కొల్చారం పాఠశాలలో ఉపాధ్యాయుడు సంపత్ నాలుగో తరగతి చదువుతున్న అక్షిత్‌కుమార్‌ను రెండురోజుల క్రితం చితకబాదాడు. అక్షిత్‌కుమార్ తల్లిదండ్రులకు తెలపగా సోమవారం వారు పాఠశాలకు వచ్చారు. అక్షిత్‌కుమార్‌ను తీసుకుని ఉపాధ్యాయుడి వద్దకు వెళ్లి ఎందుకు ఇలా కొట్టారని ప్రశ్నించారు. ఆ ఉపాధ్యాయుడు సమాధానం చెప్పకుండా వారిని తిట్టుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. గతంలో చాలామంది విద్యార్థులను బూతు మాటలు తిట్టేవారని విద్యార్థులు తెలిపారు. గతంలో అక్షిత్‌కు ఆపరేషన్ కావడంతో తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యారు. అలాగే, తోటి ఉపాధ్యాయులను ఇష్టానుసారంగా తిడుతూ ఉండేవారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. విద్యార్థి తల్లిదండ్రులు అతనిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎంఈవో సత్యనారాయణ మాట్లాడుతూ అతనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



కొల్చారం పాఠశాలలో విద్యార్థిని చూపిస్తున్న తండ్రి

వట్‌పల్లి ప్రైవేటు స్కూల్‌లో

మరో ఘటనకు సంబంధించి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామానికి చెందిన నవీన్ వట్‌పల్లిలోని స్థానిక అక్షర స్కేల్ ప్రైవేటు స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం నవీన్ హోంవర్క్ చేయలేదన్న కోపంతో ఆ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ఈ విద్యార్థిని ఇష్టానుసారంగా చితకబాదడంతో అతడి చాతిపై, కాళ్లపై వాతలు వచ్చాయి. విద్యార్థి తల్లిదండ్రులు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అయితే ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో సోమవారం బాధిత విద్యార్థి తల్లిదండ్రులతో పాఠశాలకు చేరుకుని పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయుడిని నిలదీసి ఆందోళన చేశారు. ఈ ఆందోళన మరింత పెరిగి ఉద్రిక్తంగా మారడంతో పాఠశాల యాజమాన్యం స్థానిక పోలీసులకు సమచారం అందించింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వారిని సముదాయించి ఆందోళనను విరమింపచేశారు. మూడు రోజుల క్రితం అందోల్ నియోజకవర్గంలోని అందోల్‌లో ప్రభుత్వ పాఠశాలలోనూ ఇలాంటి ఘటననే జరిగి పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా, ఆసంఘటన మరవకముందే అదే నియోజకవర్గంలోని వట్‌పల్లిలో మళ్లీ చోటుచేసుకున్నది.



వట్‌పల్లిలోని స్కూల్‌లో ఉపాధ్యాయుడు చితకబాదడంతో ఒంటిపైన అయిన గాయాలను చూపిస్తున్న విద్యార్థి

నర్సాపూర్‌లో ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

నర్సాపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలో ప్రధాన రహదారి పక్కన ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను సోమవారం మున్సిపల్ అధికారులు తొలిగించారు. ఫుట్‌పాత్, రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతుండడంతో పాటు వాహనదారులు ఇబ్బందులెదుర్కొంటున్నామని ఫిర్యాదులు వస్తుండటంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన ఉన్న ఫుట్‌పాత్‌పై దుకాణదారులు కొందరు అక్రమంగా తమ సామగ్రి పెట్టుకుని ఆక్రమించగా, మరికొందరు తమ దుకాణాల ముందు ఫుట్‌పాత్‌ను చిరువ్యాపారులకు అద్దెలకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వాటితో పాటు వాహనాలు నిలిపే చోట కూడా కొందరు ఇష్టానుసారంగా తోపుడుబండ్లు పెట్టి ఇబ్బందికరంగా చేయడంతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఇందుకు స్పందించిన మున్సిపల్ పాలకవర్గం మూడురోజుల క్రితం సమావేశమై ఆక్రమణలను తొలగించాలని తీర్మానించింది. ఆక్రమణల తొలగింపుతో పాదాచారులకు ఊరట లభించినట్టయ్యింది.



ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

వెల్‌కమ్ సార్..

సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండతిమ్మాపూర్ టీజీఐఐసీ పారిశ్రామిక వాడలో నూతనంగా ఏర్పాటు చేసిన కోకాకోలా పరిశ్రమ ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి మెదక్, సిద్దిపేట జిల్లాల అధికార యంత్రాంగం ఘన స్వాగతం పలికింది.


సీఎం రేవంత్‌రెడ్డికి కాళ్లకల్ వద్ద స్వాగతం పలుకుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్


సీఎంకు మొక్క అందజేసి స్వాగతం పలుకుతున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి


బండతిమ్మాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి


సీఎంకు స్వాగతం పాలుకుతున్న సిద్దిపేట సీపీ అనురాధ

భూ నిర్వాసితులకు వెంటనే ప్యాకేజీలివ్వాలి

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య


మహాసభలో మాట్లాడుతున్న నాగయ్య

గజ్వేల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో భూనిర్వాసితులందరికీ నష్టపరిహారం, ప్యాకేజీలు వెంటనే అందజేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో నిర్వహిస్తున్న పార్టీ సిద్దిపేట జిల్లా మహాసభల్లో రెండవ రోజు ఆయన హాజరై మాట్లాడారు. సిద్దిపేట, దుబ్బాక, చేర్యాల ప్రాంతాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి నిరుద్యోగ యువత ఉపాధి కల్పించాలన్నారు. అనంతగిరిసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, కాలువలు, ప్రాజెక్టులు, పరిశ్రమల పేరుతో గత ప్రభుత్వం వేలాది ఎకరాల భూమిని సేకరించి నిర్వాసితులకు పూర్తిస్థాయి ప్యాకేజీలు ఇవ్వలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్మికులకు కనీస వేతనాలు అమలుకు నోచుకోవడం లేదని, ఉద్యోగ భద్రత లేదన్నారు. కార్మికులకు సమగ్ర బీమా చట్టం చేయాలన్నారు. సీపీఎం రాష్ట్ర మహాసభలు సంగారెడ్డి పట్టణంలో జరుగనున్నాయని, సిద్దిపేట జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కా రాములు, జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, శశిధర్, గోపాలస్వామి, సందబోయిన ఎల్లయ్య, భాస్కర్, సత్తిరెడ్డి, బండ స్వామి, అరవింద్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల అమలుకు కృషి

● బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు


బీసీ కుల సంఘాల నాయకులతో సమావేశమైన వెంకటేశ్వరరావు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల అమలుకే బీసీ డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసినట్లు ఆ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని బీసీ కుల సంఘాల నాయకులతో సోమవారం సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో సమావేశమై దరఖాస్తులను స్వీకరించారు. అంతకుముందు కలెక్టర్ వల్లూరు క్రాంతి వెంకటేశ్వరరావుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు అమలుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు వెల్లడించారు. వివిధ కుల సంఘాల నాయకులు 24 వినతులు అందజేశారు. కార్యక్రమంలో బీసీ డెడికేటెడ్ కమిషన్ మెంబర్, సెక్రటరీ సైదులు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, బీసీ సంక్షేమ శాఖ డీడీ రమేష్, బీసీ సంక్షేమ శాఖాధికారి జగదీష్, సిద్దిపేట బీసీ సంక్షేమాధికారి షేక్ అహ్మద్, బీసీ సంక్షేమాధికారి అఖిలేష్‌రెడ్డి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, ఓబీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి బీరయ్య యాదవ్, ఆశన్నగౌడ్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలలో మెదక్‌కు మూడవ స్థానం


మెదక్ జిల్లా బాలికల రగ్బీ జట్టు

చేగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ అండర్ 14 బాల బాలికల రగ్బీ పోటీల్లో మెదక్ జిల్లా మూడవ స్థానంలో నిలిచిందనిమెదక్ జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు కరణం గణేష్ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 30 నుంచి ఈ నెల 2 వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో బాలికల విభాగంలో మూడవ స్థానం కోసం జరిగిన పోటీలలో 15-0స్కోర్‌తో కరీంనగర్ జట్టుపై గెలవగా, బాలుర జట్టు 10-0స్కోర్‌తో గెలిచి కాంస్య పతకం సాధించాయని తెలిపారు. మెదక్ జిల్లా మూడవ స్థానం సాదిండంపై ఉమ్మడి జిల్లాల ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు రమేష్, సౌందర్య అమూల్య హర్షం వ్యక్తం చేశారు.

ఎయిర్ ఫోర్స్ సైనికుడికి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు


రాము (ఫైల్)

సిద్దిపేట క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల గ్రామానికి చెందిన బండి రాము న్యూ ఢిల్లీ ఎయిర్ ఫోర్స్‌లో ఆటోటెక్ విభాగంలో సార్జెంట్ సైనికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన అకాల మరణంతో సోమవారం సిద్దిపేట పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లో ఎయిర్ ఫోర్స్ అధికారులు కవాతు చేసి మృతుడు రాముపై జాతీయ జెండాను కప్పి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు చేశారు. మూడు రౌండ్లను గాలిలో కాల్పులు జరిపి నివాళులు అర్పించారు.


తుల్జారాంపేట క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నర్సరీ


జహీరాబాద్ : హుగ్గెల్లిలో క్రీడా ప్రాంగణం దుస్థితి..

బోర్డులు సరే.. మైదానాలేవి?

అటకెక్కిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు

● పిచ్చిమొక్కలతో ఆట స్థలాలు కనుమరుగు
● పలుచోట్ల పార్కింగ్, నర్సరీలకు వినియోగం
● లక్షల రూపాయల ప్రజాధనం వృథా
● వినియోగంలోకి తేవాలని విజ్ఞప్తులు

నర్సాపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణయువతకు క్రీడలపై ఆసక్తి పెంచాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రతీ పంచాయతీలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. వీటి ఏర్పాటుకు అప్పటి సర్పంచులు, స్థానిక పంచాయతీ కార్యదర్శులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చింతే తప్పా వాటిని అనువైన చోట.. అందరికీ అందుబాటులో ఏర్పాటు చేస్తున్నారా.. లేదా?, సదుపాయాలన్నీ ఉన్నాయా? లేవా? అనేది పట్టించుకోలేదు. ఉన్నతాధికారుల ఒత్తిడి భరించలేక ఎక్కడపడితే అక్కడ.. అందనంత దూరంలో ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. దీంతో అవి ప్రస్తుతం నిరుపయోగంగా మారి పిచ్చిమొక్కలతో దర్శనమిస్తూ బోర్డులకే పరిమితమయ్యాయి.

506 క్రీడా మైదనాలు..

మెదక్ జిల్లాలో మొత్తం 506 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయగా.. ఒక్కోదాని కోసం రూ.50 వేలకు పైగా ఖర్చు చేశారు. అంతేకాకుండా క్రీడలకు సంబంధించిన కిట్లు కూడా పంపిణీ చేశారు. ఆ కిట్లు ప్రస్తుతం ఎక్కడున్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది. కనీసం క్రీడా సామాగ్రి అవసరం లేని కబడ్డీ, కోకో తదితర ఆటలు ఆడుకోవడానికి కూడా ఈ క్రీడా ప్రాంగణాలు ఉపయోగపడటం లేదు. దీంతో లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన ఈ ప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తెచ్చేందుకు చొరవ తీసుకోవాలని గ్రామీణ యువతీయువకులు కోరుతున్నారు.

వాహనాల పార్కింగ్‌కు వినియోగం..

నర్సాపూర్ పట్టణంలో మండల పరిషత్ ప్రాంగణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయగా అది మండల పరిషత్, మున్సిపల్ శాఖల మధ్య వివాదంగా మారడంతో వాహనాల పార్కింగ్ స్థలంగా మారింది. మున్సిపల్ ఆధ్వర్యంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయగా, తమ పరిధిలోని స్థలంలో ఎలా ఏర్పాటు చేస్తారంటూ మండల పరిషత్ అధికారులు అభ్యంతరం తెలిపారు. అంతేకాకుండా క్రీడా ప్రాంగణం బోర్డు ప్రక్కనే మరో బోర్డు వారు ఏర్పాటు చేసి విస్మరించారు. దీంతో ప్రస్తుతం ఆ స్థలం వాహనాలకు పార్కింగ్‌గా మారింది. ఇక తుల్జారాంపేటలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణంలో నర్సరీ ఏర్పాటు చేయడం విశేషం. నారాయణపూర్‌లో ఏకంగా క్రీడా ప్రాంగణంను స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసి పాఠశాల కంపౌండ్ వాల్‌కే బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. ఇవేకాదు మెదక్ జిల్లాలో ఎక్కడ చూసినా క్రీడా ప్రాంగణాల పరిస్థితి ఇలాగే ఉంది.

సగం మైదానాలు నిరుపయోగంగా..

జహీరాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : అధికారుల, పాలకుల పర్యవేక్షణ కొరవడడంతో క్రీడా ప్రాంగణాలు అధ్వాన్నంగా మారి నిరుపయోగంగా మారాయి. జహీరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 177 క్రీడా మైదనాలుండగా.. ఇందులో దాదాపు సగం ప్రాంగణాలు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవచూపి వాటిని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

అవినీతికి ఆస్కారం ఇవ్వొద్దు

● టీఎస్‌యూటీఎఫ్

నారాయణఖేడ్, డిసెంబరు 2: డీఎస్సీ -2024 నూతన ఉపాధ్యాయుల వేతనాలకు సంబంధించిన బిల్లుల విషయంలో అవినీతికి ఆస్కారం ఇవ్వొద్దని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్, ఉపాధ్యక్షుడు కాశీనాథ్‌జాదవ్, కార్యదర్శి మడుపతి నరేష్, ఖేడ్ ఎస్టీవో మోతిరాంను కోరారు. సోమవారం ఎస్టీవో కార్యాలయంలో ఆయనను కలిసిన వారు మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. బిల్లుల మంజూరు విషయంలో ఎలాంటి అవినీతి , జాప్యానికి తావుండదని మోతీరాం వారికి వివరించారు. ఈ కార్యక్రమంలోసంఘం డివిజన్ పరిధిలోని మండలాల బాధ్యులు హరిసింగ్‌శ్రీరానాయక్, రాములు, రవీందర్, రాజ్‌కుమార్, తదితరులుపాల్గొన్నారు.

పోలింగ్ బూత్ ఏర్పాటుకు పరిశీలన

చిన్నశంకరంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంతో పాటు చందంపేట పాఠశాలలో పోలింగ్ బూత్‌లను ఎంపీడీవో దామోదర్ సిబ్బంది సోమవారం పరిశీలించారు. ఈ సందర్భగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎమ్మెల్సీ పోలింగ్ నిర్వహించేందుకు బూత్‌లను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 7న తుది జాబితా విడుదల అవుతున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని విద్యార్థినులకు తీవ్రగాయాలు


మెదక్ - బొడ్మట్పల్లి రహదారిపై పాపన్నపేటలో విద్యార్థుల ధర్నా

● నుజ్జునుజ్జయిన ఒకరి కాలు
● మెదక్ - బొడ్మట్పల్లి రహదారిపై విద్యార్థుల ధర్నా
● ఆర్టీసీ డీఎం నిర్లక్ష్యంపై ఆగ్రహం

పాపన్నపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కళాశాలకు వెళ్లడానికి తోటి విద్యార్థులతో బస్టాండ్ వద్ద నిలుచున్న ఇద్దరు విద్యార్థినులపైకి ఆర్టీసీ బస్సు దూసుకురావడంతో తీవ్రగాయాల పాలయ్యారు. ఈ సంఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నార్సింగి వద్ద సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నార్సింగి గ్రామానికి చెందిన అఖిల, విజయ పాపన్నపేట జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. కాలేజీకి వెళ్లేందుకు నార్సింగి బస్‌స్టాప్ వద్ద, తోటి విద్యార్థులతో కలిసి నిల్చున్నారు. అదే సమయంలో బొడ్మట్పల్లి నుంచి మెదక్ వైపు వెళ్తున్న మెదక్ డిపో ఆర్టీసీ బస్సు వీరిని ఢీకొట్టింది. అఖిల కాలుపై నుంచి టైరు వెళ్లడంతో కాలు నుజ్జునుజ్జు అయ్యింది. విజయకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు ఫోన్ చేసి వారిని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహులు, లెక్చరర్లు ఇంటర్ డీఐఈవో మాధవి హాస్పిటల్‌కు వెళ్లారు. అఖిల పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో కలెక్టర్ రాహుల్‌రాజ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి విషయం తీసుకెళ్లారు. వారు వెంటనే ఆమెను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పాపన్నపేట ఏఎస్ఐ సంగన్న కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


డీఎం తీరును నిరసిస్తూ ఆందోళన

కాలేజీ విద్యార్థుల ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్య తీసుకోవాలని, కళాశాల, పాఠశాల సమయంలో బస్సుల సంఖ్య పెంచాలని విద్యార్థులతో కలిసి పాపన్నపేట, టేక్మాల్ మండల ఏబీవీపీ కన్వీనర్లు ప్రవీణ్, మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్, నగర కార్యదర్శి అనిల్ తదితరులు మెదక్ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ వద్దకు వెళ్లగా కనీసం అపాయింట్మెంట్ ఇవ్వలేదని ఆరోపించారు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో వారంతా పాపన్నపేటకు వచ్చి, కాలేజి విద్యార్థులతో కలసి, రోడ్డుపై ఆందోళనకు దిగారు. మెదక్-బొడ్మట్పల్లి రోడ్డుపై ధర్నా నిర్వహించారు. వర్షంలోనూ కదలకుండా గంట పాటు ఆందోళన కొనసాగించారు. మెదక్ డీఎం, జిల్లా అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాపన్నపేలు పోలీసులు సముదాయించినా వినలేదు. దీంతో రోడ్డుకు ఇరు వైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. బస్సుల సంఖ్య పెంచాలని, బాధ్యులైన డ్రైవర్‌పై తగిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. చివరకు ప్రిన్సిపాల్ నర్సింహులు అక్కడికి చేరుకుని విద్యార్థులను సముదాయించి, జిల్లా అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబాలకు న్యాయం చేయిస్తామని, హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రణరంగం

7వ పేజీ తరువాయి

ఉపక్రమించారు. ఆగ్రహానికి గురైన నర్సారెడ్డి వర్గీయులు బండారు శ్రీకాంత్‌రావుపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడితో ఇద్దరి మధ్య వైరం మరింత పెరిగింది. అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నామినేటెడ్ పదవులు, పార్టీ పదవుల పంపకంలో ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు మొదలైంది. కానీ, శ్రీకాంత్‌రావుకు పెద్దగా పట్టు లేకపోవడంతో హైదరాబాద్‌కు పరిమితమయ్యాడు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవుల పందేరంతో నర్సారెడ్డికి అతి దగ్గరగా ఉన్న కొందరు నాయకులు బండారు శ్రీకాంత్‌రావుతో జత కలిశారు. అప్పటి నుంచి శ్రీకాంత్‌రావు యాక్టివ్ కావడంతో పాటు మంత్రుల వద్దకు వారిని వెంట తీసుకువెళ్లి నామినెటెడ్ పదవుల విషయంలో తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ లొల్లి కాస్తా నివురుగప్పిన నిప్పులా ఉండడం.. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పూర్తిగా నర్సారెడ్డి వర్గానికి రావడంతో కొండపోచమ్మ ఆలయ కమిటీని శ్రీకాంత్‌రావు దక్కించుకున్నారు. దీంతో మరోసారి ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు పెరిగింది. ఈ క్రమంలోనే సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఫ్లెక్సీల పంచాయతీ, పోలీసులతో వాగ్వాదం ఘటనలు చోటు చేసుకున్నారు.



అయోమయంలో కేడర్

నర్సారెడ్డి, బండారు శ్రీకాంత్‌రావు వర్గాల మధ్య ఆధిపత్య పోరుతో పార్టీ కేడర్ ఇబ్బందులకు గురవుతుందని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఇద్దరి మధ్య ఆధిపత్య పోరుతో క్యాడర్ ఎటువైపు వెళ్లాలో అర్థం అవ్వక తలపట్టుకుంటున్నారు. ఈ విషయమై మధ్యలో మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చొరవ తీసుకుని సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ఎన్ఎస్‌యూఐ నుంచి పార్టీలో పుట్టి పెరిగి, సర్పంచ్‌గా, ఎంపీపీగా, డీసీసీబీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా తాను పనిచేశానని, రెండు సార్లు ఓడిపోయి ఆర్థికంగా తనతో పాటు తన అనుచరులు నష్టపోయారని, అనేక కష్టనష్టాలకు ఓర్చి పార్టీని నడిపిస్తున్నానని నర్సారెడ్డి అంటున్నారు. మొదటి నుంచి పార్టీ విధేయుడిగా ఉంటూ పార్టీలోనే కొనసాగుతున్నానని, పార్టీని అంటిపెట్టుకుని విధేయతతో పనిచేస్తున్నానని బండారు శ్రీకాంత్‌రావు చెబుతూ తమ వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. వీరు ఇరువురూ ఆధిపత్య పోరుతో పార్టీ కార్యకర్తలు, నాయకులు తలలు పట్టుకుంటూ గందరగోళానికి గురవుతున్నారు. మల్టీనేషనల్ కంపెనీ ప్రారంభోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వర్గాల పంచాయతీతో పరువు కాస్త బజారున పడ్డట్లు అయిందని కాంగ్రెస్ పార్టీ సగటు కార్యకర్తలు వాపోయారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ పెద్దలు చొరవ తీసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

క్రైం కార్నర్

ఆటో ఈఎంఐ కట్టలేక యువకుడి ఆత్మహత్య


సంజీవ్(ఫైల్)

శివ్వంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆటో ఈఎంఐ కట్టలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేటలో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట పెద్దకోళ్ల సంజీవ్(32) ఎనిమిది నెలల క్రితం ఫైనాన్స్‌లో ఆటో తీసుకుని తోలుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా, ఆటో ఈఎంఐ కట్టలేని స్థితిలో ఉండడంతో, బతుకుదెరువైన ఆటో కూడా లేకపోతే ఎలా జీవించాలని కొన్నిరోజులుగా మనోవేదనకు గురవుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరే వేసుకున్నాడు. మృతుడి భార్య శ్రీకన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

అప్పు తీర్చే మార్గం లేక వ్యక్తి..


నాగులు(ఫైల్)

శివ్వంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అప్పు తీర్చే మార్గం లేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పోతులబోగుడ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం ఆ గ్రామానికి చెందిన మంద నాగులు (32) సంవత్సరం క్రితం నాలుగైదు లక్షలు అప్పు చేసి నూతన ఇల్లు నిర్మించుకున్నాడు. ఈ అప్పు తీర్చే మార్గం కానరాక కొన్ని రోజులుగా మనోవేదనకు గురవుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం అతని పొలం దగ్గర ఉన్న అడవిలో ఓ చెట్టుకు టవాల్‌తో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కాగా అంత్యక్రియలకు పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి మృతిడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు.

విద్యార్థిని అదృశ్యం..


నీలిమ (ఫైల్)

శివ్వంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల క్రితం కాలేజీకి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన సోమవారం చిన్నగొట్టి ముక్ల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రావనిఇకి చెందిన మధిర నీలిమ (19) తూప్రాన్ లోని ఓ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతుంది. కాగా నవంబర్ 29 న ఉదయం ఏడున్నర గంటలకు కాలేజీ కని వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల వద్ద, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

భర్తను కొట్టి చంపిన భార్య

మునిపల్లి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి) : భర్తను భార్య కొట్టి చంపిన సంఘటన మక్తక్యాసారం గ్రామంలో సోమవారం నాడు చోటుచేసుకుంది. కొండాపూర్ సీఐ వెంకటేశం, మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని శంషాబాద్‌కు చెందిన గుడ్ల సంపత్ (39)కు సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం మక్తక్యాసారం గ్రామానికి చెందిన మంజులతో పన్నెండ్ల క్రితం వివాహంగా ఇద్దరు పిల్లలున్నారు. గతేడాది నుంచి వారి మధ్య చిన్నపాటి గొడవలు జరుగుతుండడంతో మంజుల పుట్టింటికి వచ్చింది. పది రోజుల క్రితం సంపత్ అత్తగారింటికి వచ్చి నితయం మద్యం తాగి భార్యతో గొడపడేవాడు. సోమవారం కూడా గొడవ జరగడంతో భార్య మంజుల అతడిపై కట్టెతో దాడిచేసి బయటకు నెట్టేయగా అక్కడున్న బండపై పడి మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

7 నుంచి సీఎం కప్ క్రీడోత్సవాలు

మెదక్ అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈ నెల 7 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు 36 విభాగాల్లో సీఎం కప్ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సోమవారం తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామస్థాయి పోటీలు జరుగుతాయని, ఆన్‌లైన్‌లో పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని క్రీడాకారులకు సూచించారు.

అన్ని గ్రామాల్లో 'సీఎం కప్' నిర్వహించాలి

కోహీర్, డిసెంబరు 2: (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించాలని జిల్లా మత్స్య శాఖ, మండల ప్రత్యేక అధికారి నర్సింగ్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామపంచాయతీ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి ఈనెల 10, 12 తేదీల్లో మండల స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులోనూ ప్రతిభ కనబరిచిన వారికి 16, 21 తేదీల్లో జిల్లా స్థాయి పోటీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 27న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు.

'అడవికి నిప్పు' నివారణపై అవగాహన

మాసాయిపేట/రామాయంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అడవికి ఏదైనా ప్రమాదవశాత్తు లేదా ఇతర కారణాలతో నిప్పంటుకుంటే బాధ్యతగా నిప్పును ఆర్పివేయాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి అంబర్ సింగ్, పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాల కారణంగా జంతు జాలానికి, ప్రకృతి సంపదకు నష్టం వాటిల్లకుండా అందరూ సహకరించాలని ఆయన కోరారు. సోమవారం మాసాయిపేట మండలం పోతన్‌పల్లి గ్రామంలో 'అడవికి నిప్పు-ప్రకృతి సంపదకి ముప్పు' అనే అంశంపై గ్రామస్థులకు పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి ఓం ప్రకాశ్, అటవీ అధికారులు చిరంజీవి, మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. రామాయంపేట మండలం అక్కన్నపేట హైస్కూల్లో అటవీప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణపై ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ గీత విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ అటవీ సంరక్షణకు తన వంతు కృషి చేయాలని సూచించారు. దీనిలో శ్రీనివాస్ నాయక్, సిబ్బంది ఉన్నారు.

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ మండల సంఘం ఎన్నిక

జిన్నారం, డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడిగా రాజేశ్వర్ ఎన్నికయ్యారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడిగా రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారి బ్రహ్మం, మహిళా ఉపాధ్యక్షురాలు కవిత, సభ్యులు ఎన్నికయ్యారు.

'ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి'

జిన్నారం, డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి): గడ్డపోతారంలో ఈ నెల 4న నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్కే ఫౌండేషన్ అధ్యక్షుడు రమాకాంత్ తెలిపారు. ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని, కాజీపల్లి, వావిలాల, అల్లీనగర్, కిష్టయ్యపల్లి పరిసర గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

'డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి'

వట్‌పల్లి,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర ఇతర వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్‌ఐ విఠల్ తెలిపారు సోమవారం వట్‌పల్లిలో ఇద్దరూ శిక్షణ ఎస్‌ఐలు ప్రశాంత్‌రెడ్డి, సయ్యద్ మునివర్‌అలీతో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలు పాటించని పలువురు వాహనదారులకు జరిమానాలు విధించారు.

చదువుకుంటే బంగారు భవిష్యత్తు

కోహీర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి బాగా చదువుకుంటేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని కోహీర్ తహసీల్దార్ బాలశంకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన రూమ్ టూ రీడ్ సంస్థ గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో కోటి రుద్రాక్షల శోభాయాత్ర

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహాశివ పర్వదినాన ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో కోటి రుద్రాక్షలతో నిర్వహించే శివలింగాన్ని ఏర్పాటు చేయనున్నారు.జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమ వ్యవస్థాపకుడు మహేశ్వరశర్మ సిద్ధాంతి రుద్రాక్షలకు ప్రత్యేక పూజలు చేసి సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని ఆశ్రమం వరకు శోభాయాత్ర నిర్వహించారు.

'ప్రతీ విద్యార్థి ఇష్టపడి చదువుకోవాలి'

వెల్దుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తహసీల్దార్ కృష్ణ సూచించారు. ప్రజా పాలన విజయోత్సవాలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో ఎంఈవో యాదగిరితో కలిసి తహసీల్దార్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

చిన్న వర్షానికే చెరువును తలపిస్తున్న బస్టాండ్



మెదక్ న్యూబస్టాండ్ ఆవరణలో నిలిచిన మురుగు నీరు

- దుర్గంధం వెదజల్లుతున్న మెదక్ ఆర్టీసీ బస్టాండ్
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

మెదక్ అర్బన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మెదక్ ఆర్టీసీ న్యూబస్టాండ్ దుర్గంధంతో నిండిపోయింది. సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి చుట్టుపక్కల డ్రైనేజీల నుంచి వచ్చిన వర్షపు నీరు చేరి చెరువులను తలపించిన బస్టాండ్ ఆవరణలో ఇంకా నీళ్లు అలాగే నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు మురుగునీటిని బయటకు పంపే ప్రయత్నం కూడా చేయకపోవడం గమనార్హం. సంస్థ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. నిల్వ ఉన్న నీటి పక్కను మూత్రశాలలు ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. చిన్నపాటి వర్షానికే బస్టాండ్ అవరణ చెరువును తలపించే విధంగా మారింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో ఆవరణలోకి వర్షపు, మురుగు నీరు రాకుండా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలతోపాటు ప్రయాణికులకు కోరుతున్నారు.

రామాయంపేటలో వర్షం

రామయంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. ఇప్పటికే ఈదురుగాలులు.. చలికి వణికిపోతున్న జనాన్ని ఫెంగల్ తుఫాను రెండు రోజుల నుంచి ఇంట్లో నుంచి బయటకు రాకుండా చేస్తోంది.



ఆదివారం చిరుజల్లులు రాగా సోమవారం ఒక్కసారిగా కురిసిన వర్షంతో రోడ్లపై మిగిలిన వరి ధాన్యం కూడా తడిసిపోయింది.

పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం



ఖేడ్ ఏరియా వైద్యశాలలో సిబ్బందిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్యానికి తమ ప్రభుత్వం అధికప్రాధాన్యతను ఇస్తుందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ప్రజా పాలన విజయోత్సవంలో భాగంగా నారాయణఖేడ్ ఏరియా వైద్యశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సురక్షిత ప్రసవాలతోపాటు తల్లి,శిశువుల క్షేమం కోసం హైరిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభించామన్నారు. వైద్యశాలలో ఆధునిక పరికరాలతో పాటు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా వైద్యశాలల్లో అత్యవసర సేవలతోపాటు ప్రమాదాల నివారణ, పాముకాటు, కుక్కకాటు మందులు అందుబాటులో ఉంచుతున్నట్టు చెప్పారు. ఆరోగ్య శ్రీ సేవలు, ఆయుష్‌సేవలు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందిని, శానిటేషన్ సిబ్బందిని ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించారు. కాగా ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో వేయించిన స్వచ్ఛతా వాల్‌పేయింటింగ్స్‌ను ఎమ్మెల్యే సంజీవరెడ్డి పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్యశాల సూపరింటెండెంట్ రమేష్, వైద్య సిబ్బంది, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్‌దారం శంకర్, ఆర్డీవో అశోక చక్రవర్తి, తహసీల్దార్ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, నాయకులు ఉన్నారు.

భ్రష్టు పట్టించింది మీరే.. పైగా మొసలి కన్నీరా?

బీఆర్ఎస్ సర్కార్ పదేళ్ల అధికారంలో ఉన్న సమయంలో గురుకులాలను పట్టించుకోకుండా భ్రష్టు పట్టించి, ప్రస్తుతం మొసలి కన్నీరు కార్చడం ఏమిటని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నారాయణఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమాన్ని చేపట్టి, మౌళికసదుపాయాలు కల్పించామన్నారు. 11 నెలల్లోనే విద్యాభివృద్ధికి అనేక చర్యలు చేపట్టిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే విద్యాసంస్థలవైపు కన్నెత్తి చూడలేదన్నారు.

పెండింగ్ డబ్బు చెల్లిస్తేనే సర్వే చేస్తాం




సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశాకార్యకర్తలు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గతంలో నిర్వహించిన లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించే వరకు ప్రస్తుత లెప్రసీ సర్వే చేయబోమని ఆశా కార్యకర్తలు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయ ఏవో వాణికి వినతిపత్రాన్ని అందజేశారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.

- జహీరాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అతితక్కువ వేతనంతో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు అదనపు పనులను అప్పగిస్తున్న నేపథ్యంలో అదనపు పారితోషికం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు మైపాల్ పేర్కొన్నారు. ఆశా వర్కర్లకు పనిభారం తగ్గించాలని, అదనపు పనులకు అదనపు పారితోషికం ఇవ్వాలని కోరుతూ సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సీహెచ్‌వో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.


అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి విమర్శించారు. సంగారెడ్డి చౌరస్తాలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లాకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై చార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ 2023 అసెంబ్లీ ఎన్నికల వేళ 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలను వంచించిందన్నారు. కాంగ్రెస్‌ది గ్యారెంటీల గారడీ అని విమర్శించారు. 6 అబద్దాలు, 66 మోసాలతో ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్ సర్కారు, ఏం సాధించారని విజయోత్సవాలు నిర్వహిస్తుందో చెప్పాలని డిమాం డ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న రూ.12 వేలు, రైతులకు రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, పంటల బీమా ఇవ్వకుండా రైతులను దగా చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రూ.6,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, అనంతరావుకులకర్ణి, నాయకులు దేశ్ పాండే, అదెల్లిరవీందర్, డా.రాజుగౌడ్, రాములు, విజయ్, మీన తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

ఎమ్మెల్యేపై విమర్శలు తగవు: కాంగ్రెస్



రామాయంపేటలో మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత రావు

రామాయంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో ఎన్నో నిధులు తెచ్చి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే రోహిత్‌రావును విమర్శించడం హాస్యాస్పదమని బీజేపీ నాయకులపై టీపీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మాజీ ఎంపీపీ రమేష్ రెడ్డి,జిల్లా సేవాదళ్ చైర్మన్ కోటి యుగంధర్ తో కలిసి ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో సుప్రభాతరావు మాట్లాడారు. మెదక్ లో మెడికల్, నర్సింగ్ కాలేజీలు వెనక్కు తెచ్చిన ఘనత ఎమ్మెల్యే రోహిత్ సాధించిన విజయం కాదా..! అని ప్రశ్నించారు. సమావేశంలో కౌన్సిలర్లు దేమే యాదగిరి, సుందర్ సింగ్, గంగాధర్, నాయకులు ఉన్నారు.

- చిన్నశంకరంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు అనవసరంగా కాంగ్రెస్ జోలికి వస్తే చూస్తూ ఊరుకోబోమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాన సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి హెచ్చరించారు. రామాయంపేటలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, బీజేపీ నాయకుడు పంజా విజయ్‌కుమార్ కాంగ్రెస్ సంక్షేమ పథకాలపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకుల విమర్శలను ఘాటుగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాల మేలు చేస్తుంటే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేయడం తగదన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

జహీరాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగులు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయరాదని సంగారెడ్డి రీజియన్ ఆర్టీసీ మెడికల్ అధికారి డా.శృతి, జహీరాబాద్ డిపో మేనేజరు జాకీర్‌హుస్సేన్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీకి డిపార్టుమెంట్‌లోని ప్రతీ వింగ్ అత్యంత కీలకమైందన్నారు. ఆరోగ్యాల విషయంలో జాగ్రత్తలకు సంబంధించి పలు సూచనలు చేశారు.

ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణ చేయండి

- టీజేఎంయూ రాష్ట్ర కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన వేతన సవరణ చేయాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లె కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఏడాదిలో ఆర్టీసికి రూ.7500 కోట్ల ఆదాయం పెరిగిందని ప్రకటించిన యాజమాన్యం కార్మికుల సంక్షేమానికి కూడా పాటు పడాలన్నారు. తక్షణమే 30 శాతం ఫిట్‌మెంట్‌తో ఏప్రిల్ 2021 నుంచి వేతన సవరణ చేయాలని కోరారు. చట్టబద్దంగా నాలుగు నెలల్లో ఏప్రిల్ 2025 వరకు రెండు పే స్కేళ్లు అమలులోకి రావాలని తెలిపారు.

ప్రజాపాలన విజయోత్సవాలపై కళాజాత



మనూరులో ప్రజా విజయోత్సవాలపై కళాకారుల ప్రదర్శన

మనూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తికావస్తున్న నేపథ్యంలో ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాలు 2024లో భాగంగా సోమవారం మనూరు, పుల్‌కుర్తి, మాయికోడ్ గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో కళాకారులు కళాప్రదర్శనలిచ్చారు. ఏడాదికాలంలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమపథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పాటలు, ప్రదర్శనల ద్వారా వివరించారు.

చిట్కుల్‌లో సోషల్ ఆడిటింగ్‌పై గ్రామ సభ

చిలప్‌చెడ్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 3వ విడత సామాజిక తనిఖీలో మండలంంలోని చిట్కుల్ గ్రామంలో సోమవారం గ్రామ సభను నిర్వహించినట్లు కార్యదర్శి తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం గ్రామంలో సామాజిక తనిఖీ నిర్వహించి సోమవారం గ్రామసభలో పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. అందులో భాగంగా 16 పనులకు గాను కూలీలకు చెల్లించిన వేతనాలు, ఖర్చులు తదితర వివరాలు గ్రామసభలో వివరించినట్లు తెలిపారు.

ఇన్‌స్పైర్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి



జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం

నర్సాపూర్,డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మెదక్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శనలో నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్ జడ్పీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మధు ప్రథమ బహుమతి పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు అతడిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్రదర్శనలో ఇదే పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి సంతోష్ ద్వితీయ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ యూసుఫ్‌ను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాజియాతబస్సుమ్, ఉపాధ్యాయులు సూర్యప్రకాష్‌రావు, మహేందర్‌రెడ్డి, సత్యనారాయణచారి, కవిత, వెంకటేశ్వరరావు, అప్పలనాయుడు, సురేష్,సుందరయ్య, బస్వరాజు, నర్సింలు తదితరులున్నారు.

రోడ్డు భద్రతపై పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

తూప్రాన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో నిర్వహించిన రోడ్డు భద్రతపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్, రంగోత్సవం పోటీలను నిర్వహించగా, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఏఎస్‌ఐ లక్ష్మీ, జీఎంఆర్ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్‌వేస్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ, మేనేజర్ ప్రవీణ్‌కుమార్ బహుమతులు అందజేశారు. విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు పోటీలు నిర్వహించినట్లు వివరించారు.

గృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం

నారాయణఖేడ్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఖేడ్‌మండలం నమ్లీమేట్‌కు చెందిన నిరుపేద మీర్‌సాబ్ ఇంటి నిర్మాణం చేపట్టినప్పటికీ,ఆర్థిక ఇబ్బందులతో ఇంటి పైకప్పు పనులు నిలిచిపోయాయి. పనులు పూర్తి చేయించడానికి, ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న గుర్రపు మశ్చందర్ ఫౌండేషన్ ప్రతినిధి, మండలరైతు సమన్వయ సమితి మాజీ కోఆర్డినేటర్ సత్యపాల్‌రెడ్డి, అమెరికాలో ఉన్న ఫౌండేషన్‌చైర్మన్ గుర్రపు మశ్చందర్ దృష్టికి ఈవిషయాన్ని తీసుకెళ్లారు. ఆయన సూచనతో ఇంటి పైకప్పుపూర్తి చేయడానికి అవసరమైన నగదును సోమవారం మీర్‌సాబ్ కుటుంబీకులకు అందజేశారు.

పెండింగ్ నిధులు విడుదల చేయండి



సంగారెడ్డి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీకి పెండింగ్ ఉన్న నిధులను విడుదల చేయాలని పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు బలరాం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని కోరారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి నిదులు విడుదల చేయాలని విన్నవించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ, సహా అధ్యక్షుడు వెంకటరెడ్డి, జిల్లా ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్, మల్లికార్జున్, ఇమ్రాన్, శ్రీనివాస్, అరుణ్, విఘ్నేష్, వినయ్, సుమాన్ తదిరులు ఉన్నారు.

గ్లోబల్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలి

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో అన్ని పనులు చేస్తూ ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని గ్లోబల్ టెండర్ విధానం వల్ల తీవ్రంగా నష్టపోతామని కాంట్రాక్టర్ అసోసియేషన్ నాయకుడు రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డిలోని ట్రాన్స్‌కో కార్యాలయం పలువురు కాంట్రాక్టర్లతో కలిసి ధర్నా చేశారు. గ్లోబల్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

హెచ్‌ఐవీతో ప్రాణాలకే ముప్పు



సంగారెడ్డిలోని డిజైర్‌లో చిన్నారులతో న్యాయాధికారి రమేష్

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధితో ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని, జాగ్రత్తగా ఉండాలని న్యాయాధికారి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. సంగారెడ్డిలో డిజైర్ సొసైటీ సంస్థలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజైర్ సంస్థలో ఉన్న హెచ్‌ఐవీకి గురైన పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలని, జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిజైర్ సొసైటీ నిర్వాహకులు నిర్మల, సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

రాక్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



రాక్ చర్చిలో కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభిస్తున్న పాస్టర్ యేసుపాల్

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని రాక్ చర్చిలో సోమవారం పాస్టర్ యేసుపాల్ కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. యువతుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిస్టర్ నళిని షమ్మీరాజ్, పలు చర్చిల పాస్టర్లు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర పాలన, అభివృద్ధే బీజేపీ లక్ష్యం: మెదక్ ఎంపీ



ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు

జిన్నారం, డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి): దేశంలో సుస్థిర పాలన, అభివృద్ధే బీజేపీ లక్ష్యమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. సోమవారం వావిలాల గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి అయన కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు మద్దూరి రాజు, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలను సందర్శిస్తే అరెస్టులా?

నారాయణఖేడ్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థుల స్థితిగతులను తెలుసుకోవడానికి గురుకులాలకు వెళ్తే తమను అరెస్టు చేయడం ఏమిటని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్‌లోని కస్తూర్బా పాఠశాలను సందర్శించడానికి వెళ్లిన భూపాల్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలను భ్రష్టు పట్టించిందన్నారు. తమ పార్టీ గురుకుల విద్యార్థులస్థితిగతులను తెలుసుకోవడానికి గురుకుల బాటపట్టడంతో పోలీసుల ద్వారా అరెస్టు చేయడం దారుణమన్నారు.

'రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమించిన కేసీఆర్'

గుమ్మడిదల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమాన్ని నిర్వహించిన పోరాటయోధుడు కేసీఆర్ అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి కొనియాడారు. గుమ్మడిదల మండలకేంద్రంలోని శ్రీవెంకటేశ్వర సినిమా థియేటర్లో కేసీఆర్ స్ఫూర్తిగా విడుదలైన కేసీఆర్ (కేశవచంద్ర రమావత్) చిత్రాన్ని సోమవారం నియోజకవర్గ నాయకులతో కలిసి మూడు రోజుల ఉచిత ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత ప్రజలను ఏకతాటిపై తీసుకువచ్చి, ప్రత్యేక రాష్ట్రం సాధించిన మహనీయుడు కేసీఆర్ అని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజాసంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దారన్నారు. అలాంటి వ్యక్తి స్ఫూర్తిగా విడుదలైన కేసీఆర్ చిత్రాన్ని నియోజకవర్గ ప్రజలు, అభిమానులు వీక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆదర్శరెడ్డి, మెట్టు కుమార్ యాదవ్, కొలాన్ బాల్‌రెడ్డి జిన్నారం వెంకటేశంగౌడ్, నాయకులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సిద్దిపేట జిల్లాలో కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన సందర్భంగా నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు కలిశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవులరాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో పాటు ఇతర నాయకులు సీఎంను శాలువాతో సత్కరించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎం దృష్టికితీసుకెళ్లినట్లు నాయకులు తెలిపారు.

- నర్సాపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి)